ప్రజాశక్తి
గురువారం 15 ఫిబ్రవరి 2024
పార్వతీపురం మన్యం

పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

ఏనుగుల దాడిలో పంటలు కోల్పోయిన రైతులను నష్టపరిహారంతో ఆదుకోవాలని సిపిఎం జిల్లా నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం జిల్లా అటవీ శాఖ కార్యాలయంలో సిపిఎం నాయకులు రామారావు, బాధిత రైతులు కలిసి వినతి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొమరాడ మండలం కళ్లికోట గ్రామంలో మూడు రోజులుగా ఏనుగులు కేబేజీ, మొక్కజొన్న, టమాట తదితర పంటలను ధ్వంసం చేశాయన్నారు. ఏనుగులు మొక్కజొన్న, వ్యవసాయ పంపు మోటర్ వంటి సామగ్రి ధ్వంసం చేస్తుంటే అటవీ శాఖ అధికారులు చూడడమే తప్ప ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం చాలా అన్యాయమని తెలిపారు. ఏనుగులను అడవికి లేదా జూకి తరలించి, రైతులను ఆదుకోవాలని కోరారు.

ఇలాంటి ఎమ్మెల్యేను దేశంలోనే చూడలేదు

"పార్వతీపురం ఎమ్మెల్యేకు అవినీతి రావు అని పేరు పెట్టాలేమో!. భూములు కబ్జా చేస్తాడు. చెరువులను పూడ్చి పట్టాలు సృష్టిస్తాడు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగాలు అమ్ముకుంటాడు. ఏకంగా తహశీల్దార్ సంతకాలే ఫోర్జరీ చేస్తాడు. ఇలాంటి ఎమ్మెల్యేను దేశంలో ఎక్కడా చూడలేదు. ఎ1, ఎ2లు జగన్, సాయి రెడ్డి అయితే ఇక్కడ ఎమ్మెల్యే ఎ3 గా అనుకోవచ్చు".

- పార్వతీపురం సభలో స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావుపై టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ వ్యాఖ్యలు

ఉత్తరాంధ్ర దోపిడీకి ఆ ముగ్గురికి లైసెన్స్

- చిన్నశ్రీను చేతిలో రిమోట్ కంట్రోల్ రాజన్నదొర
- అధికారంలోకి వస్తే జిల్లాలో కేన్సర్ ఆస్పత్రి
- శంఖారావం సభల్లో నారా లోకేష్

కార్యకర్తలతో కరచాలనం చేస్తున్న లోకేష్

సభకు హాజరైన జనం ; మాట్లాడుతున్న టిడిపి జాతీయ ప్రధానకార్యదర్శి నారా లోకేష్

ప్రజాశక్తి-సాలూరు, పార్వతీపురం రూరల్, బాడంగి

ఉత్తరాంధ్ర జిల్లాల దోపిడీకి సిఎం జగన్‌మోహన్‌రెడ్డి ముగ్గురు వైసిపి నేతలకు లైసెన్సు ఇచ్చారని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. వారు ఈ ప్రాంతంలో భూ కబ్జాలు, దందాలు చేస్తున్నారని ఆరోపించారు. అధికారంలోకి వస్తే సమస్యలను పరిష్కరించడంతో పాటు జిల్లాకొక కేన్సర్ ఆస్పత్రి ఏర్పాటు చేస్తామని తెలిపారు. టిడిపి చేపట్టిన శంఖారావంలో భాగంగా బుధవారం పార్వతీపురం, సాలూరు, బొబ్బిలి నియోజకవర్గం బాడంగిలో జరిగిన సభల్లో నారా లోకేష్ మాట్లాడారు. ఉత్తరాంధ్ర జిల్లాలను దోచుకోవడానికి మంత్రి బొత్స సత్యనారాయణ, ఎంపీ విజయసాయిరెడ్డి, మరో ఎంపీ వైవి సుబ్బారెడ్డిలకు జగన్ లైసెన్స్ ఇచ్చారని ఆరోపించారు. ఈ ప్రాంతంలో భూముల కబ్జా, దందాలు ఆ ముగ్గురి కనుసన్నల్లో జరిగాయని విమర్శించారు. నియోజకవర్గానికి చెందిన డిప్యూటీ సీఎం రాజన్నదొర రిమోట్ కంట్రోల్ నాయకుడని అన్నారు. జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు చేతిలో రిమోట్ వుంటుందని చెప్పారు. ఉపముఖ్యమంత్రి అయినా గిరిజనుల జీవితాల్లో మార్పు రాలేదన్నారు. పెద్ద ఎత్తున భూకబ్జాలు చేసి బినామీ పేర్లపై పెట్టారని విమర్శించారు. ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలోనూ రాజకీయాలు జొప్పించారని, మన్యం జిల్లా లో గెలిచిన పాచిపెంట జట్టును ఫైనల్స్‌కు పంపకుండా రాజకీయం చేశారని ఆరోపించారు.

పార్వతీపురం నియోజకవర్గానికి హామీలు

తాము అధికారంలోకి వస్తే పార్వతీపురం పట్టణానికి బైపాస్ రోడ్డు, ప్రతి ఇంటికి కుళాయిల ద్వారా సురక్షితనీరు, డంపింగ్ యార్డును తరలించి మోడ్రన్ పట్టణంగా తీర్చుదిద్దుతామన్నారు. జంఘావతి, అడారు మినీ రిజర్వాయర్ పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. సీతానగరం, బలిజిపేట మండలాలకు తోటపల్లి సాగునీరు అందిస్తామన్నారు. నియోజకవర్గంలో స్పోర్ట్స్ స్టేడియం కట్టిస్తామన్నారు. మున్సిపల్ కౌన్సిలర్ కోరాడ నారాయణరావుపై జరిగిన దాడిని పార్టీ తీవ్రంగా ఖండించిందని తెలిపారు.

క్రిస్టియన్ కార్పొరేషన్ ఏర్పాటు చేస్తాం

బాడంగిలో సభకు ముందు నారా లోకేష్‌ను అరకు పార్లమెంట్ పరిధిలోని 32 మండలాల పరిధిలోని పాస్టర్ హెడ్‌లు కలిసి సమస్యలను విన్నవించారు. తమకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, అసెంబ్లీలో తమ వాణి వినిపించేందుకు అవకాశం ఇవ్వాలని కోరారు. క్రిష్టియన్ మైనార్టీలకు ప్రత్యేక కార్పొరేషన్, బైబిల్ కాలేజి ఏర్పాటు చేయాలన్నారు. లోకేష్ మాట్లాడుతూ... యువగళం పాదయాత్రలో క్రిష్టియన్ మైనార్టీలు సమస్యలను స్వయంగా చూశానని అన్నారు. అధికారంలోకి వచ్చిన తరువాత క్రిస్టియన్ కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. చర్చిల నిర్మాణాలకు సహకారం అందిస్తామన్నారు. బరియల్ గ్రౌండ్స్ ఏర్పాటుతో పాటు ప్రహరీలు నిర్మిస్తామన్నారు.

అనంతరం జరిగిన సభలో లోకేష్ మాట్లాడుతూ ఇక్కడి ఎమ్మెల్యే శంబంగి ఇంకులేని పెన్నులాంటి వారని విమర్శించారు. మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడును పదవుల్లో న్యాయం చేయలేకపోయామని, తన తప్పిదం వల్లే జరిగిందని, మరోసారి అలా జరగకుండా అధికారంలోకి వచ్చిన వెంటనే లక్ష్మునాయుడును చట్ట సభలకు పంపిస్తామని ప్రకటించారు. బాడంగి మండలంలో సమస్యలన్నీ పరిష్కరిస్తామని తెలిపారు. కొండదేవరపల్లి లిఫ్ట్ ఇరిగేషన్ పనులు ప్రారంభిస్తామని, బాడంగి, రామభద్రపురం మండలాలకు పెద్దగెడ్డ నీరందిస్తామని తెలిపారు. ఇక్కడ ఎరుకుల పాకలో సర్పంచ్, ఎంపిటిసిలు పాలవలస గౌరును అభివృద్ధి పనులు చేయకుండా వృత్తులకు అడ్డుపడుతూ కేసులు పెడుతూ అధికారులు భయపెడుతున్నారని అన్నారు. అధికారంలోకి వచ్చిన తరువాత ఇబ్బంది పెట్టిన వారిని వదిలి పెట్టేది లేదని అన్నారు.

పార్వతీపురంలో సభాధ్యక్షులు టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి బోనెల విజయచంద్ర మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే మన ఇళ్లపైకి గూండాలను, పోలీసులను పంపి వేధిస్తున్నారు, మీకు వడ్డీతో సహా తిరిగి చెల్లించేరోజు దగ్గర్లోనే ఉందని హెచ్చరించరు. సాలూరులో సభకు అధ్యక్షత వహించిన నియోజకవర్గ ఇంఛార్జి సంధ్యారాణి మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ఉన్న ఇరిగేషన్ ప్రాజెక్టులను ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని, మంజూరైన జైకా నిధులను కూడా ఖర్చు చేయలేదని చెప్పారు. బాడంగిలో బొబ్బిలి నియోజక వర్గ ఇన్‌ఛార్జి బేబినాయన మాట్లాడుతూ నియోజకవర్గడంలో నెలకొన్న సమస్యలను వివరించారు. సభల్లో అరకు పార్లమెంటు పార్టీ అధ్యక్షులు కిడారి శ్రావణ్ కుమార్, మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్, మాజీ ఎమ్మెల్యేలు బొబ్బిలి చిరంజీవులు, ఆర్‌పి భంజ్‌దేవ్, తెంటు లక్ష్మునాయుడు, జనసేన నాయకులు లోకం మాధవి, బొబ్బిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గిరడ అప్పలస్వామి, పార్వతీపురం ఇన్‌ఛార్జి ఆదాడ మోహనరావు తదితరులు మాట్లాడారు.

జిల్లాకు జగన్ నెరవేర్చని 50 హామీలు

ఉమ్మడి విజయనగరం జిల్లాలో పర్యటన సందర్భంగా జగన్ 50 హామీలు ఇచ్చారని ఏ ఒక్కటి కూడా నెరవేర్చలేదని లోకేష్ అన్నారు భోగాపురం ఎయిర్ పోర్టును, రామతీర్థ సాగర్, పెద్దగెడ్డ ప్రాజెక్టులను పూర్తి చేయలేదని, గోస్తా-చంపావతి నదుల అనుసంధానం చేయలేదని తెలిపారు. టిడిపి-జనసేన అధికారంలోకి వస్తే హామీలన్నీ నెరవేరుస్తామని తెలిపారు. కియా మాదిరిగా ఉత్తరాంధ్రకు పెద్దఎత్తున పరిశ్రమలు తీసుకువస్తామన్నారు.

లోకేష్‌కు వినతులు

పార్వతీపురంలో వివిధ వర్గాల ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యలపై యువనేతకు పెద్దఎత్తున వినతిపత్రాలు అందజేశారు. సిపిఎస్, జిపిఎస్‌లను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని సిపిఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. టిడిపి మేనిఫెస్టోలో సిపిఎస్, జిపిఎస్ రద్దు, ఒపిఎస్ అమలు అంశాలను చేర్చాలని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మురళీమోహనరావు.. లోకేష్‌కు వినతి అందించారు.

లోకేష్‌కు వినతి అందిస్తున్న యుటిఎఫ్ నాయకులు

లోకేష్‌కి కనీస అవగాహన లేదు

కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్ప శ్రీవాణి

ప్రజాశక్తి - కురుపాం

ఏ జిల్లాలో మీటింగ్ పెట్టారో కనీస అవగాహన లేకుండా నారా లోకేష్ మాట్లాడారని ఎమ్మెల్యే పి.పుష్పశ్రీవాణి ఎద్దేవాచేశారు. బుధవారం తమ కోట వద్ద ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొని మన్యం జిల్లాని ఏర్పాటు చేస్తే.. కనీసం మన్యం జిల్లాలో సమావేశం పెట్టామనే కనీస అవగాహన లేకుండా విజయనగరం జిల్లా అని మాట్లాడడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. పేద ప్రజలకు ఇచ్చిన మాట తప్పకుండా ముఖ్యమంత్రి నెరవేరుస్తుంటే పేద, ప్రజలను, రైతులను మోసం చేసిన ఘనత చంద్రబాబుదేనని విమర్శించారు. సంక్షేమ పాలన చంద్రబాబు అందిస్తే 2019 ఎన్నికల్లో 23 మంది ఎమ్మెల్యేలనే ప్రజలు ఎందుకు గెలిపించారో లోకేష్ అర్థం చేసుకోవాలని హితవుపలికారు. రాష్ట్రంలో రెండు లక్షలకు పైగా ఉద్యోగాలు ఇచ్చిన ఘనత సిఎం జగన్మోహన్ రెడ్డిదేనని చెప్పారు. ఉమ్మడి విజయనగరం జిల్లాలో 10 వేలకు పైగా సచివాలయ ఉద్యోగ నియామక ఉత్తర్వులు స్వయంగా తానే ఇచ్చానని గుర్తుచేశారు.

టిడిపి నాయకులు గానీ, గ్రామాల్లో కానీ ఎక్కడైనా ఏ సర్వే నెంబర్‌లో అయినా భూములు కబ్జా చేసినట్లు రుజువు చూపించాలన్నారు. తన సొంతింటి నిర్మాణానికి ఇసుక కోసం చలానా కట్టి తెచ్చుకున్నామే తప్ప ఇసుక మాఫియా చేసే అవసరం తమ లేదని కొట్టిపారేశారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగాలు అమ్ముకుంటున్నామని లోకేష్ అనడం దారుణమన్నారు. నియోజకవర్గంలో ఎవరి దగ్గరైనా ఉద్యోగాలకు రూపాయి కూడా తీసుకున్నానని రుజువు చేయగలరా? అని ప్రశించారు. అసత్యాలు వల్లెవేస్తూ, దొంగ స్క్రిప్టులు చదివి బురదజల్లకుండా, ఆధారాలు చూపించాలని సవాల్ విసిరారు. కార్యక్రమంలో ఎంపిపి శెట్టి పద్మావతి, జెడ్‌పిటిసి జి.సుజాత, వైసిపి వాణిజ్య విభాగాల జిల్లా అధ్యక్షులు అంధవరపు కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే ఊరుకోం

పార్వతీపురం ఎమ్మెల్యే అలజంగి జోగారావు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

సభకు జనాలు రాలేదనే ఆక్రోశంతో నారా లోకేష్ ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే చూస్తూ ఊరుకోబోమని ఎమ్మెల్యే అలజంగి జోగారావు హెచ్చరించారు. పార్వతీపురంలో శంఖారావం సభలో తనపై లోకేష్ చేసిన అవినీతి ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ టిడిపి పార్వతీపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా మీరు ఏరికోరి తీసుకువచ్చిన బోనెల విజయ్ చంద్ర గతంలో నిర్వహించిన స్వచ్ఛంద సంస్థకు ఏ విధంగా మోసం చేశారో ఆ సంస్థ ప్రతినిధులు పార్వతీపురం నడిబొడ్డున కూర్చుని ఆరోపిస్తే దాన్ని ఈరోజు వరకు ఆయన ఖండించలేదని చెప్పారు. మాజీ ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేల అవినీతి గురించి పట్టణంలో ఏ ఒక్కరిని అడిగినా చెబుతారని తెలిపారు. బహిరంగ సభకు కనీస జన సమీకరణ చేయలేని చేతగాని తనాన్ని కప్పిపుచ్చుకోవడానికి తనపై ఆరోపణలు చేస్తున్నారని వ్యాఖ్యానించారు. తనపై గాని, తమ నాయకుడిపై గాని ముమ్ముందు ఆరోపణలు చేస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయని అన్నారు.

మాస్టర్ షటిల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లా స్థాయి మాస్టర్స్ షటిల్ బ్యాడ్మింటన్ సెలెక్షన్ కమ్ టోర్నమెంట్ లో సింగిల్స్ విభాగంలో ప్రథమ స్థానం, డబుల్స్ విభాగంలో ద్వితీయ స్థానంలో నిలిచి రాష్ట్ర పోటీలకు విద్యుత్‌శాఖ రికార్డ్ అసిస్టెంట్ గా పనిచేస్తున్న పి.పైడిరాజు ఎంపికయ్యారు. ఈ నెల 16 నుండి 18 వరకు రాజ మహేంద్రవరంలో 35 నుండి 70ఏళ్ల వరకూ అన్ని కేటగిరీ లో జరుగునున్న పోటీల్లో పాల్గొననున్నారు. ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలవాలని విద్యుత్ శాఖ ఎస్ఇ మువ్వల లక్ష్మణ్‌రావు, ఇఇ పి.హరి, స్పోర్ట్స్ కార్యదర్శి వి.మోహన్‌బాబు అభినందించారు.

ఉద్యోగుల సమస్యలపై దశల వారీ పోరాటం

ప్రజాశక్తి - కురుపాం

డిటి నాగేశ్వరరావుకు వినతిపత్రం అందిస్తున్న ఉద్యోగ సంఘాల నాయకులు

ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సమస్యల కోసం ఎపి జెఎసి పిలుపుమేరకు దశల వారి పోరాటాలు చేస్తామని కురుపాం తాలూకా యూనిట్ అధ్యక్షులు ఎస్.ఎస్.ప్రకాశరావు తెలిపారు. బుధవారం తహశీల్దార్ కార్యాలయంలో డిటి నాగేశ్వరరావుకు యూనియన్ నాయకులతో కలిసి ఉద్యోగుల సమస్యలపై వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర మంత్రులతో జెఎసి చర్చలు విఫలం కావడంతో బుధవారం నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరైనట్లు చెప్పారు. మధ్యాహ్న భోజన విరామ సమయంలో సమస్యలపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేలా వినతిపత్రం అందించామన్నారు. కార్యక్రమంలో తాలూకా ఉపాధ్యక్షులు కె.రామకృష్ణ, ఎ.సత్యనారాయణ, ఎస్.రమణ, పి.భారతి, ట్రెజరీ బి.సంతోష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం రాజన్నదొర

అపజయాలే విజయాలకు మెట్లు

విద్యార్థులకు డిప్యూటీ సీఎం రాజన్నదొర హితబోధ

ప్రజాశక్తి-మక్కువ

అపజయాలకు భయపడకుండా వాటిని మెట్లుగా మలుచుకొని జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని గిరిజన విద్యార్థులకు డిప్యూటీ సీఎం రాజన్నదొర హితబోధ చేశారు. బుధవారం మండలంలోని దబ్బగడ్డ పంచాయతీ పరిధిలో అనసభద్ర సమీపంలో నిర్మించిన ఏకలవ్య ఆదర్శ పాఠశాలను ఆయన జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతోమంది గిరిజన విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించారని తెలిపారు. వారంతా కార్పొరేట్ స్కూల్లో కాకుండా ప్రభుత్వ పాఠశాల నుండే చదువు సాగించారని గుర్తుచేశారు. గిరిజన అభివృద్ధే ధ్యేయంగా విద్యారంగంలో సమూల మార్పులతో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారని తెలిపారు. అందులో భాగంగానే పాఠశాలను ప్రారంభించుకోగలిగామని చెప్పారు. వైసిపి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో 28 ఏకలవ్య పాఠశాలలను ప్రారంభించామని, అందులో నాలుగు ఉమ్మడి విజయనగరం జిల్లాలో ఉన్నాయని వెల్లడించారు. మెరుగైన ప్రతిభ కనబరిచిన గిరిజన విద్యార్థులకు అధునాతనమైన సౌకర్యాల నడుమ ఏకలవ్య పాఠశాలలో విద్య అందిస్తున్నట్లు చెప్పారు. అనంతరం కలెక్టర్ నిశాంత్ మాట్లాడుతూ ప్రభుత్వం సుమారు ఒక్కో విద్యార్థికి రూ.90 వేల వరకు ఖర్చు చేస్తుందని తెలిపారు. ఏ కార్పొరేట్ సంస్థ కూడా ఈ తరహా విద్యను నిరుపేద గిరిజనులకు అందించడం సాధ్యం కాదన్నారు. అలాంటిది ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. చీఫ్ ఇంజనీర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ సుమారు 29 కోట్ల రూపాయలతో ఏడు విభాగాలుగా ఈ భవన సముదాయాలు నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. ఇప్పటికే రూ.12 కోట్లు విడుదల అయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి ఎం.శ్రీనివాసరావు, ఎంపిపి మర్రి పారమ్మ, ఎంపిడిఒ దేవకుమార్, సర్పంచ్ సేదరపు లక్ష్మి, వైసిపి మండల నాయకులు ఎం.రంగునాయుడు, ప్రిన్సిపల్ ఎర్రు నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

సిహెచ్‌డబ్ల్యుల సామూహిక దీక్షలు

ప్రజాశక్తి-సీతంపేట

సిహెచ్‌డబ్ల్యులను ఆశాలుగా మార్పు చేయాలని, రూ.పది వేలు వేతనం ఇవ్వాలని, ఇతర సౌకర్యాలు కల్పించాలని సీతంపేట ఐటిడిఎ వద్ద కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యాన సామూహిక దీక్షలు చేపట్టారు. దీక్షా శిబిరాన్ని బుధవారం సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిహెచ్‌డబ్ల్యులు రూ.4వేలు గౌరవ వేతనంతో పనిచేస్తున్నారని తెలిపారు. యూనిఫాం, టిఎ, డిఎలు ఏవీ ఇవ్వడం లేదని చెప్పారు. గిరిజన ప్రాంతాల్లో ప్రజలకు సేవలు అందిస్తున్న కమ్యూనిటీ హెల్త్ వర్కర్లకు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. దీక్షా శిబిరాన్ని ఐఎఫ్‌టియు సీనియర్ నాయకులు ఎన్.నీలంరాజు సందర్శించి, మద్దతు తెలిపారు. సిఐటియు జిల్లా నాయకులు ఎం.కాంతారావు ఆధ్వర్యాన చేపట్టిన దీక్షల్లో సిహెచ్‌డబ్ల్యులు బి.పార్వతి, ఎం.సోములమ్మ, ఎస్.శిరీష, ఎన్.రంభ, కె.శ్రీలత, బి.కమల, ఎస్.సుమోని, ఎన్.శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురంరూరల్.. సిహెచ్‌డబ్ల్యుల దీక్షా శిబిరాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

పార్వతీపురంరూరల్ : పార్వతీపురం కలెక్టరేట్ ఎదుట సిహెచ్‌డబ్ల్యులు దీక్షలు చేపట్టారు. మూడు రోజులపాటు చేపట్టే దీక్షా శిబిరాన్ని సిఐటియు నాయకులు గొర్లి వెంకటరమణ ప్రారంభించారు. దీక్షా శిబిరం వద్దకు వచ్చిన ఐటిడిఎ ఎపిఒ పి.మురళీధర్‌కు వినతి అందించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ, నాయకులు కొల్లి సాంబమూర్తి మాట్లాడుతూ కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు ఎంత పని చేసినా కూడా కనీస వేతనం అందని పరిస్థితులు నెలకొన్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశాలుగా గుర్తించాలని, కనీస వేతనం రూ.10 వేలు ఇవ్వాలని డిమాండ్ చేవారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు బి.సూరిబాబు, కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్ యూనియన్ నాయకులు శ్రీదేవి, మల్లీశ్వరి, రాజేశ్వరి, ప్రమీల, జీవిత, దమయంతి, బేబీ చిన్న తల్లి, పుష్పలత పాల్గొన్నారు.

జెఇఇ మెయిన్స్‌లో 'వేదాంత' విద్యార్థుల హవా

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

జెఇఇ మెయిన్స్‌లో పార్వతీపురం వేదాంత జూనియర్ కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. 11 మంది విద్యార్థులు జెఇఇ అడ్వాన్స్‌కు అర్హత సాధించారని వేదాంత జూనియర్ కళాశాల చీఫ్ మెంటార్ పెంట అప్పారావు తెలిపారు. తుమిడి సుజిత్ కుమార్ 94.89, కోరాడ దర్శిని 91,01, దొగ్గ హర్షవర్ధన్ 88.02 పర్సంటైల్ సాధించారు. వేదాంత స్థాపించాక వరుసగా మూడు బ్యాచుల విద్యార్థులు ఐఐటి - జెఇఇలో హ్యాట్రిక్ విజయాలు అందించారని డైరెక్టర్ ఎస్.ఎల్.నాయుడు తెలిపారు. ఈ ఘనత సాధించిన విద్యార్థులకు, వేదాంత జూనియర్ కళాశాల అధ్యాపక బృందానికి వారు అభినందనలు తెలిపారు.

హామీలు అమలు చేయాలి

ఎపి పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ డిమాండ్

ప్రజాశక్తి-వీరఘట్టం

జిఒ 57, 132 ప్రకారం పంచాయతీకి వచ్చిన ఆదాయంలో 60 శాతం నిధులు జీతాలకు వెచ్చించి, ఇస్తున్న జీతాలు పెంచి అందించాలని ఎపి పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ డిమాండ్ చేసింది. బుధవారం మండల కేంద్రంలోని పంచాయతీ కార్మికులతో ఏర్పాటు చేసిన సమావేశంలో యూనియన్ జిల్లా నాయకులు ఎన్‌వై నాయుడు, మండల నాయకులు ఎన్.ప్రసాదరావు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ కార్మికుల పట్ల చిన్నచూపు మానుకోవాలన్నారు. మున్సిపాలిటీలు, నగర పంచాయతీ కార్మికులకు ఇస్తున్న హక్కులను పంచాయతీ కార్మికులకు అమలు చేయాలని డిమాండ్ చేశారు. పని భారం పెరుగుతున్నందున కార్మికులను పెంచాలని కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరారు. సబ్బులు, నూనె, చెప్పులు, బట్టలు ఇవ్వాలన్నారు. మరణించిన కార్మికుల కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించాలని, దహన సంస్కార ఖర్చులు ఇవ్వాలని డిమాండ్‌చేశారు. సెలవులను అమలు చేయాలన్నారు. ఈ నెల 16న చేపడుతున్న గ్రామీణ భారత్ బంద్‌కు మద్దతు తెలుపుతున్నట్లు ప్రకటించారు. అనంతరం గ్రామీణ బంద్ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు పి.ప్రసాద్, వి.కాంచనమ్మ, ఎన్.వెంకటేష్, పి.శ్రీను, జయమ్మ, కళ్యాణి, సుశీల, బాబూరావు, తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఎపి పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు, కార్మికులు

దామోదరం సంజీవయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు

నిర్మాణాత్మక ఆలోచనలకు నిలువుటద్దం సంజీవయ్య

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

నిర్మాణాత్మక ఆలోచనలకు నిలువుటద్దం దామోదరం సంజీవయ్యని డిఆర్‌ఒ జి.కేశవనాయుడు కొనియాడారు. మాజీ సిఎం దామోదరం సంజీవయ్య జయంతి ఉత్సవాలను బుధవారం కలెక్టరేట్‌లో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సంజీవయ్య చిత్రపటానికి డిఆర్‌ఒ పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహాత్ముడు చూపిన బాటలో సాగుతూ దామోదరం సంజీవయ్య దేశంలోనే తొలి దళిత ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారని తెలిపారు. తెలుగును అధికారభాషగా ప్రకటించడానికి కృషి చేశారన్నారు. దేశభక్తి, సమతాదృష్టి, నిర్మాణాత్మక ఆలోచనలకు ఆనవాలయిన ఆయన జీవిత చరిత్ర మరింత వెలుగులోకి తీసుకుని రావాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి ఎల్.రమేష్, సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా అధికారి ఎం.డి.గయాజుద్దీన్, బిసి వెల్ఫేర్ అధికారి ఎస్.కృష్ణ, కలెక్టరేట్ ఎఒ పి.రామారావు, సూపరింటెండెంట్లు వి.సుజాత, బి.చిన్నికృష్ణ, ఎ.శ్రీనివాసరావు, ఎ.సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

బంద్ విజయవంతానికి విస్తృత ప్రచారం

పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్ సింహాచలం

కమిషనర్ విస్తృత పర్యటన

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

పట్టణంలోని పలు వార్డుల్లో బుధవారం కమిషనర్ పి.సింహాచలం విస్తృతంగా పర్యటించారు. 23వ వార్డు బోటువీధిలో ప్రజలను కలిసి సమస్యలను తెలుసుకున్నారు. పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. కొత్తవలసలో ఐదో వార్డు పరిధిలోని ఓవర్ బ్రిడ్జి కింద పారిశుధ్య పనులను పరిశీలించారు. అనంతరం బెలగాంలో ఎంఆర్ఎఫ్ సెంటర్‌ను సందర్శించారు. ఇటీవల కొనుగోలు చేసిన కోకోనట్ కటింగ్ మిషన్ ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారి సన్యాసిరావును ఆదేశించారు. అనంతరం డంపింగ్ యార్డును సందర్శించారు. డంపింగ్ యార్డ్ ప్రహరీ ముందు కంపోస్ట్ తయారీకి ఏర్పాటు చేయాలని ప్రజారోగ్య అధికారి సిహెచ్ మురళికి సూచించారు.

పిఎసిఎస్ గోదాములు ప్రారంభం

ప్రజాశక్తి - రామభద్రపురం

మండల కేంద్రంలో గల పిఎసిఎస్‌కు చెందిన గోదాములను బుధవారం స్థానిక ఎమ్మెల్యే ఎస్‌వి చినప్పలనాయుడు ప్రారంభించారు. సుమారు రూ.36 లక్షలతో నూతనంగా నిర్మించిన 5 గోదాములను, నూతనంగా ఏర్పాటు చేసిన జనరిక్ మెడికల్ షాపును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పిఎసిఎస్‌ల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ప్రతి మండల కేంద్రంలోనూ సెంట్రల్ బ్యాంకు ఏర్పాటు చేసి గ్రామీణ ప్రాంత ప్రజలకు ఈ బ్యాంకుల ద్వారా అధిక సదుపాయాలు, వ్యవసాయ, అనుబంధ రుణాల మంజూరుకు కృషి చేయాలని ఆదేశించామన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి అప్పికొండ సరస్వతి, పిఎసిఎస్ అధ్యక్షులు కిర్ల చంద్రశేఖర్, డిసిసిబి సీఈఓ జనార్ధనరావు, విశాఖ డెయిరీ అధ్యక్షులు చొక్కాపు రామకృష్ణ, జెసిఎస్ కన్వీనర్ చింతల సింహాచలం నాయుడు, స్థానిక వైసిపి నాయకులు, సిబ్బంది అప్పారావు, పరమేశు, వాసు పాల్గొన్నారు.

కెవిడి ఎంప్లాయీస్ ఆర్థిక సాయం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

కొండవెలగాడకు చెందిన కెవిడి ఎంప్లాయిస్, శ్రీవిజయ దుర్గా యూత్ బుదవారం అదే గ్రామానికి చెందిన గిరిజాల సత్యవతికి రూ.50వేలు, బూటి రాముకు రూ.10వేలు ఆర్థిక సహాయం అందజేశారు. గిరిజాల సత్యవతి కొంతకాలంగా గుండె వ్యాధితో బాధపడుతున్న విషయం తెలుసుకున్న కెవిడి ఎంప్లాయీస్, విజయ దుర్గా యూత్ ఆమెకు ఆర్థిక సాయం చేశారు. అలాగే బూటి రాము కొంతకాలంగా అనారోగ్యంతో ఆర్థిక ఇబ్బంది పడుతున్నట్లు గుర్తించి ఆయనకు కూడా సాయం అందించారు. వైజాగ్‌లో బాధితురాలు సత్యవతి ఇంటికి వెళ్లి నగదు అందించారు. ఈ సందర్భంగా సేవా కార్యక్రమాలు చేస్తున్న కెవిడి ఎంప్లాయిస్, యూత్‌ను, పెద్దలు, గ్రామస్తులు అభినందిస్తున్నారు.

మహిళలు ఉన్నత స్థాయికి ఎదగాలి

ప్రజాశక్తి- శృంగవరపుకోట

మహిళా సాధికారత లక్ష్యంగా మహిళలు ఆర్థికంగా, సామాజికంగా ఉన్నత స్థాయిలో ఉండేందుకు బలోపేతం చెయ్యడం కోసం అక్క చెల్లమ్మలకు ఇచ్చిన మాట తప్పకుండా స్వయం సహాయక సంఘాలకి 4వ విడత రుణమాఫీలు చేసిన ఘనత జగనన్నకు తొక్కుతుం దని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని ఆకుల డిపో ప్రాంగణంలో బుధవా రం నిర్వహించిన వైయస్సార్ ఆసరా సంబరాలలో ఆయన పాల్గొని మాట్లాడారు. మండలంలో మొత్తం 1312 స్వయం సహాయ సంఘాలలో గల 14,255 మంది మహిళలకు సుమారుగా రూ.7.82కోట్లు మంజూరు చేశామన్నారు. మళ్లీ జగనన్నని సీఎంగా గెలిపించుకోడానికి మనం అందరం సిద్దంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ వేచలపు చినరాము నాయుడు, స్టేట్ ఫోక్ అండ్ కల్చరల్ డైరెక్టర్ వాకాడ రాంబాబు, జామి, ఎస్‌కోట వైసిపి మండల అధ్యక్షులు గొర్లె రవి, మోపాడ కుమార్, వైస్ ఎంపిపి పినిశెట్టి వెంకటరమణ, ఎస్.కోట పట్టణ అధ్యక్షుడు రెహమాన్, పోతనాపల్లి సర్పంచ్ కూనిరెడ్డి వెంకటరావు, కొట్టం శానాపతి చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటడం అవసరం

ప్రజాశక్తి- శృంగవరపుకోట

పర్యావరణాన్ని కాపాడేందుకు మొక్కలు నాటడం అవసరమని ఇండియన్ రెడ్ క్రాస్ జిల్లా మేనేజ్మెంట్ కమిటీ మెంబర్ దొడ్డి సూర్యారావు అన్నారు. ఈ సందర్భంగా పట్టణంలో ఉన్న ట్రైబల్ వెల్ఫేర్ స్కూలు, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ తరపున బుధవారం మొక్కలను నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కార్యక్రమంలో మొక్కలు నాటే కార్యక్రమం ప్రధానమైనదన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ చైర్మన్ డాక్టర్ పి వరలక్ష్మి, ఆశపు మల్లేశ్వర రావు, శ్రీనాథ్ వెంకన్న బాబు, కమిటీ మెంబర్ జోగారావు మాస్టర్‌తో పాటు ట్రైబల్ స్కూల్ అధ్యాపకులు, హై స్కూల్ అధ్యాపకులు, జూనియర్ కాలేజ్ ప్రిన్సిపల్ పి.కృష్ణమూర్తి, కాలేజీ అధ్యాపకులతో కలిసి పనస, నేరేడు, వేప, కాగు, నల్లమద్ది, మొక్కలను నాటారు.

వీరఘట్టంలో ఫ్యామిలీ డాక్టర్

ప్రజాశక్తి-వీరఘట్టం

వీరఘట్టం గ్రామంలోని నాలుగో సచివాలయ పరిధిలో బుధవారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి పి.ఉమామహేశ్వరి రోగులకు వైద్య పరీక్షలు చేశారు. మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎఎన్ఎం, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య సేవలకు స్పందన

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని సింగరాయలో బుధవారం నిర్వహించిన 104 వెహికల్ సేవలకు విశేష స్పందన లభించింది. ఈ వైద్య సేవలకు వచ్చిన రోగులకు వేపాడ ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం వైద్య అధికారిని ఏ. ధరణి పరీక్షలు నిర్వహిం చారు. అనంతరం ఉచితంగా మందు లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నిరుజోగి వెంకటరావు, పిహెచ్‌సి సిబ్బంది తంగేటి సత్యనారాయణ, ఆశ వర్కర్ జుంజురు రామలక్ష్మి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పైడితల్లమ్మ ఆలయ ప్రతిష్ట

ప్రజాశక్తి - భోగాపురం

మండలంలోని పోలిపల్లిలో పైడితల్లి అమ్మవారి ఆలయ పున్న ప్రతిష్ట కార్యక్రమం బుధవారం అంగరంగ వైభవంగా జరిగింది. ఎమ్మెల్యే బడ్డు కొండ అప్పలనాయుడు ప్రారంభోత్సవం చేశారు. ప్రభుత్వం సిజిఎఫ్ నిధుల నుంచి రూ.50 లక్షలు మంజూరు చేయగా మిగతా సొమ్మును గ్రామస్తులు చందాలు వేసుకొని నిర్మించారు. ఈ సందర్భంగా ఆదివారం నుంచి మూడు రోజులగా ఈ ప్రతిష్టకు సంబంధించిన ప్రత్యేక కార్యక్రమాలు జరుగుతున్నాయి. గ్రామ పెద్దలు కర్రోతు బంగార్రాజు, వెంకటరమణ, పతివాడ రామకృష్ణ, కర్రోతు పైడిరాజు తదితరులు మాలలు ధరించి ఆలయంలో వేద పండితుల మధ్య పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే పాల్గొని వచ్చిన భక్తులకు అన్న ప్రసాదాలను వడ్డించారు. గ్రామస్తులంతా పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. అన్నదానానికి టిడిపి నియోజకవర్గ ఇంఛార్జి కర్రోతు బంగార్రాజు రూ. 20వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో పతివాడ నారాయణస్వామి నాయుడు, తమ్ము నాయుడు, కర్రోతు సత్యన్నారాయణ, పిన్నింటి చిన్న, శంకర్, కర్రోతు బంగార్రాజు, సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - భోగాపురం

మండలంలోని రెడ్డికంచేరు పంచాయతీలో వివిధ అభివృద్ధి పనులకు వైసిపి మండల అధ్యక్షులు ఉప్పాడ సూర్యనారాయణ రెడ్డి బుధవారం శంకుస్థాపన చేశారు. పంచాయతీలో నూతనంగా వేస్తున్న సిమెంట్ రోడ్లు, కాలువలకు శంకుస్థాపన చేయగా గాబువానిపాలెంలోని శ్మశాన వాటికలో బోరును ప్రారంభించారు.

ప్రజాశక్తి- పార్వతీపురం టౌన్

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్, మతతత్వ విధానాలను రైతులు, కార్మికులు ప్రతిఘటించి ఈ నెల 16న చేపట్టే గ్రామీణ భారత్ బంద్, కార్మికుల సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ, ఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్షులు గేదెల సర్వేశ్వరరావు కోరారు. బుధవారం పార్వతీపురంలోని నాలుగురోడ్ల కూడలిలో గాంధీ విగ్రహం వద్ద కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రచారం చేశారు. అనంతరం జంక్షన్ నుండి పాతబస్టాండ్ వరకు ప్రదర్శన చేపట్టారు. అనంతరం కూరగాయల మార్కెట్ రైతులకు కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోడీ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం కార్పొరేట్, మతతత్వ విధానాలను అవలంబిస్తుందన్నారు. మోడీ ప్రభుత్వ వైఫల్యాల వల్ల ప్రజలకు తీవ్ర ఆర్థిక భారాలు ఎదురవుతున్నాయని చెప్పారు. బిజెపి అధికారంలోకి వచ్చి పదేళ్లు పూర్తయినా దాని ఎజెండాలో పేర్కొన్న ఏ ఒక్క హామీనీ నెరవేర్చలేదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలను కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు, ఉద్యోగుల్లోకి తీసుకెళ్లి, కేంద్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించేందుకు పోరాటాన్ని ఉధృతం చేస్తామన్నారు. అందులో భాగంగా చేపడుతున్న గ్రామీణ బంద్, కార్మికుల సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు, ఐఎఫ్‌టియు నాయకులు బంకురు సూరిబాబు, పి.రాజశేఖర్, సిహెచ్.మౌళి, ఆర్.సర్వేశ్వరరావు, కృష్ణ, ఆర్.శివ, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

సాలూరురూరల్ : గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయాలని ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మండలంలో మామిడిపల్లి, కూర్మరాజుపేట, తదితర గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి లక్ష్మునాయుడు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఆర్.ఈశ్వరరావు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చాక రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర ఉండడం లేదన్నారు. ఉపాధి కూలీలకు కూలి గిట్టుబాటు కావడం లేదని చెప్పారు. ఉపాధి నిధులు తగ్గించేశారని తెలిపారు. కార్మికులకు అండగా ఉన్న చట్టాలను మార్చి, నాలుగు లేబర్ కోడ్‌లు తీసుకొచ్చారని, కార్మికుల హక్కులను హరించారని ఆగ్రహం వ్యక్తంచేశారు. వీటన్నింటిపై చేపడుతున్న బంద్, కార్మికుల సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు, నాయకులు చిన్నారావు, ప్రజానాట్యమండలి నాయకులు రామారావు, తదితరులు పాల్గొన్నారు.

సాలూరులో ఆటో ప్రచారం చేస్తున్న ఎపి రైతుసంఘం, వ్యకాస నాయకులు

పార్వతీపురంలో ప్రచారం చేస్తున్న కార్మిక సంఘాల నాయకులు

సీతానగరం : ఈ నెల 16న జరిగే గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి లక్ష్మునాయుడు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు రెడ్డి ఈశ్వరరావు కోరారు. మండలంలో పలు గ్రామాల్లో బంద్ విజయవంతానికి బుధవారం ఆటో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతాంగానికి నష్టం తీసుకొచ్చే చట్టాలను రద్దు చేయాలని గతంలో ఆందోళన చేసిన సందర్భంలో కేంద్రం హామీలు ఇచ్చినా అమలు చేయలేదన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు వై.రామారావు, కృష్ణ, వెంకటరమణ పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : గ్రామీణ బంద్ జయప్రదం చేయాలని కోరుతూ గుమ్మలక్ష్మీపురంలో బుధవారం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు కోరాడ ఈశ్వరరావు ఆధ్వర్యాన వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో చెముడు గూడ ఎంపిటిసి మండంగి రమణ, కుక్కిడి సర్పంచి బిడ్డిక రాజారావు, ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు బిడ్డిక శంకర్రావు, సన్యాసిరావు, ఆడిత్ తదితరులు పాల్గొన్నారు.

కురుపాం : 16న చేపట్టే గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని కార్మిక జెఎసి జిల్లా నాయకులు కోరాడ ఈశ్వరరావు కోరారు. బుధవారం మండలంలో నీలకంఠపురం పంచాయతీ మామిడిమానుగూడ జంక్షన్ వద్ద ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా నాయకులు బిడ్డికి వెంకటరావు, అనిల్ కుమార్ ఆధ్వర్యంలో వాల్‌పోస్టర్ విడుదల చేశారు. కార్యక్రమంలో ఆరిక ముకుందరావు, కొండగొర్రి నాగేశ్వరరావు, శివ తదితరులు పాల్గొన్నారు.

ప్రగతిబాటలో పల్లెలు

ఎమ్మెల్యే అలజంగి జోగారావు

ప్రజాశక్తి-సీతానగరం

వైసిపి ప్రభుత్వంలో ప్రతీ పల్లె ప్రగతిబాట పట్టిందని ఎమ్మెల్యే అలజంగి జోగారావు తెలిపారు. మండలంలోని గెడ్డలుప్పిలో రూ.43 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రభుత్వ సేవలను ప్రజల చెంతకు తెచ్చామని తెలిపారు. గ్రామాలలో సచివాలయ, వాలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసి గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం స్థాపనకు విశేష కృషి చేస్తున్నట్లు చెప్పారు. గ్రామంలో ఇంటింటికీ కుళాయిలు ద్వారా తాగునీరు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. కొత్తవలస గ్రామానికి బిటి రోడ్డు నిర్మాణానికి ఇప్పటికే రూ.2.45 కోట్ల గ్రాంట్ మంజూరు చేసినా, కాంట్రాక్టరు జాప్యం వల్ల నిర్మాణం కాలేదని తెలిపారు. అది కూడా త్వరలో పూర్తి చేస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో నాయకులు బలగ శ్రీరాములునాయుడు, జెడ్‌పిటిసి మామిడి బాబ్జీ, వైసిపి మండల అధ్యక్షులు బొంగు చిట్టి రాజు, వైస్ ఎంపిపి టి.సూర్యనారాయణ, సర్పంచులు అల్లు తిరుపతి రావు, రెడ్డి అనిత అప్పల నాయుడు, ఎంపిటిసి పాటూరి సత్యనారాయణ, నాయకులు పోల ఈశ్వరనారాయణ, అంబటి కృష్ణంనాయుడు, ఎన్.రామకృష్ణ పాల్గొన్నారు.

బస్‌షెల్టర్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు

బస్‌షెల్టర్ ప్రారంభం

పార్వతీపురం టౌన్ : పట్టణ పరిధిలోని కొత్తవలస ప్రధాన రహదారిలో లయన్స్ క్లబ్ సభ్యులు మాదా కృష్ణ తల్లిదండ్రులు మాదా గంగరాజు, సోమరాజు జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన బస్‌షెల్టర్‌ను బుధవారం పార్వతీపురం, పాడేరు ఎమ్మెల్యేలు అలజంగి జోగారావు, భాగ్యలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లయన్స్ క్లబ్ సభ్యులు ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని మౌలిక సదుపాయాలు కల్పించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు, వైసిపి ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

దోపిడీపై చర్చకు సిద్ధమా? : టిడిపి

ప్రజాశక్తి-భామిని

పాలకొండ శంఖారావం సభలో లోకేష్ ప్రసంగాన్ని తప్పుబట్టిన వైసిపి నాయకులు.. ఆ పార్టీ దోపిడీ, అరాచకాలపై బహిరంగ చర్చకు సిద్ధమా? అని టిడిపి మండల ప్రధానకార్యదర్శి ఎం.జగదీశ్వరరావు సవాల్ విసిరారు. బుధవారం భామినిలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఇసుక దోపిడీ, భూ దందా, మద్యం, గంజాయిని ప్రోత్సహించి, ప్రజల జీవితాలు ఛిద్రం చేస్తున్న వైసిపికి నారా లోకేష్‌ను విమర్శించే నైతికత లేదన్నారు. నిరుద్యోగ యువతకు గంజాయిని అలవాటు చేసి, రాష్ట్రాన్ని గంజాయి హబ్బుగా మార్చలేదా? అని ప్రశ్నించారు. పాలకొండ శంఖారావం సభకు వచ్చి, సభను జయప్రదం చేసిన భామిని మండలంలోని టిడిపి కార్యకర్తలు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి భూపతి ఆనందరావు, కమిటీ సభ్యులు సాకేటి రామారావు, బిడ్డికి ప్రసాద్, లక్ష్మి పాటినాయుడు, కోరాడ రాజేష్ పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులపై అవగాహన

ప్రజాశక్తి - కురుపాం

పంటల్లో సమగ్ర సస్యరక్షణ విధానాలు, మేలైన యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించాలని ఎడి సురేష్‌కుమార్ శాస్త్రవేత్తలకు సూచించారు. బుధవారం రస్తాకుంటుబాయి కెవికెలో 40వ శాస్రీయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు ఎప్పటికప్పుడు తెలుసుకుని తగు సూచనలు అందించాలని ఎడి సూచించారు. అనంతరం కెవికెలో 2023-24లో చేపట్టిన, 2024-25లో చేపట్టాల్సిన కార్యక్రమాల ప్రణాళికల గురించి చర్చించారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ఎక్స్‌టెన్సన్ శాస్త్రవేత్త బి.ముకుందరావు, ప్రధాన శాస్త్రవేత్తలు కె.లక్ష్మణ్, పి.సీతారాం, మోహన్, కెవికె శాస్త్రవేత్తలు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి-సాలూరు

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కార్మికులు బుధవారం మున్సిపల్ మేనేజర్ రాఘవాచార్యులుకు వినతి పత్రం అందజేశారు. మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ పట్టణ అధ్యక్షులు టి.రాముడు, కార్యదర్శి టి.శంకరరావు ఆధ్వర్యాన కార్మికులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమ్మె కాలానికి వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. చర్చల సందర్భంగా జరిగిన ఒప్పందం అమలు చేయాలని కోరారు. పెరుగుతున్న జనాభాకి అనుగుణంగా మున్సిపాలిటీ లో కార్మికుల సంఖ్య పెంచాలని డిమాండ్ చేశారు.



వినతి అందిస్తున్న మున్సిపల్ కార్మికులు, నాయకులు

క్షేత్రస్థాయికి వస్తే లోపాలు తెలుస్తాయి

అధికారుల తీరుపై ఎంపిపి ఆగ్రహం

సమావేశంలో మాట్లాడుతున్న సభ్యులు

ప్రజాశక్తి -భామిని

విధుల్లో నిర్లక్ష్యం వహించకుండా అధికారులు క్షేత్ర స్థాయిలో ప్రతీ అంశం పరిశీలిస్తే, లోపాలు తెలుస్తాయని ఎంపిపి తోట శాంతికుమారి తెలిపారు. బుధవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ కొవ్వాడ కిశోర్‌కుమార్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి పనులను ఎపిఒ క్షేత్ర స్థాయిలో పరిశీలించడం లేదని, పనులలో కనీసం నాణ్యత లేదని ఎంపిపి తెలిపారు. 10 మంది వెళ్తే మస్టర్ షీట్‌లో 30 మంది పేర్లు నమోదు చేస్తున్నారని చెప్పారు. ఇంట్లో ఉన్న, వలస వెళ్లిన వారికి కూడా ఉపాధి హామీ పనులలో హాజరు నమోదవుతుందంటే అర్థం ఏమిటని ఎపిఒ తులసిదాస్‌ను ప్రశ్నించారు. తక్షణమే ఫిర్యాదు తీసుకుని, పై అంశాలు పరిశీలించాలని ఎపిఒకి ఎంపిడిఒ సూచించారు.

రబీ సీజన్లో రైతులకు అవసరమైన విత్తనాలు అందుబాటులో ఉండేలా చూడాలని మండల ప్రత్యేక ఆహ్వానితులు తోట సింహాచలం తెలిపారు. అంగన్వాడీలు నిర్వహణను ఐసిడిఎస్ పిఒ క్షేత్ర స్థాయిలో పరిశీలించాలని ఎంపిటిసిలు కోరారు. విఒఎలు మహిళా సంఘాల నుండి డబ్బులు వసూలు చేస్తున్నారని, ఫిర్యాదు చేసినా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని వైస్ ఎంపిపి మజ్జి మోహన్‌బాబు ఎపిఎంను ప్రశ్నించారు. సంఘాలతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని ఎపిఎం తెలిపారు. పొలంలో విద్యుత్ వైర్లు వేలాడుతున్నాయని చెప్పి రైతు దరఖాస్తు ఇస్తే.. సంబంధిత అధికారులు తీసుకోలేదని ఎంపిటిసి చంద్రశేఖర్ సమావేశంలో ప్రస్తావించారు. సమావేశంలో వైస్ ఎంపిపి బోనగడ్డి ధర్మారావు, ప్రత్యేక ఆహ్వానితులు కొత్తకోట ఆంజనేయులు, జెడ్‌పిటిసి బొడ్డేపల్లి ప్రసాద్ రావు, డిప్యూటీ తహశీల్దార్ శేఖరం, ఎంపిటిసి భూస బాలకృష్ణ, బిడ్డికి తులసి, పిఎసిఎస్ చైర్మన్ గెల్లంకి రమేష్, సర్పంచ్‌లు చంటి, పాపి నాయుడు, సరిసభద్ర దాలయ్య, వైద్యాధికారి శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అక్షరాభ్యాసాలు

ప్రజాశక్తి - కురుపాం

కురుపాంలోని విజ్ఞాన భారతి పాఠశాలలో వసంత పంచమి సందర్భంగా బుధవారం అక్షరాభ్యాసాలు నిర్వహించారు. కరస్పాండెంట్ పాండు రంగారావు ఆధ్వర్యాన అర్చకులు శ్రీనివాసరావు 40 మంది చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ గణపతిరావు, పాఠశాల సిబ్బంది శ్రీనివాస్, చంద్రశేఖర్, సునీత, జ్యోతి పాల్గొన్నారు.

విజ్ఞాన భారతి పాఠశాలలో అక్షరాభాస్యాలకు హాజరైన చిన్నారులు, తల్లిదండ్రులు

గుమ్మలక్ష్మీపురం : వసంత పంచమి సందర్భంగా స్థానిక చింతలగూడవీధి పాఠశాలలో చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల మేనేజర్ బేత కృష్ణమూర్తి నాయుడు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కుమారస్వామి, వాలంటీర్లు సునీత, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

మాఘహేలా సూర్యవైభవాలు ప్రారంభం

సూర్యపీఠంలో సూర్యవైభవాలు పూజల్లో పాల్గొన్న జనం

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

పట్టణ శివారులో ఉన్న శ్రీసూర్య పీఠంలో వేమకోటి నరహరి శాస్త్రి ఆధ్వర్యంలో మాఘహేలా సూర్య వైభవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వసంత పంచమి సందర్భంగా చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వేమకోటి వివేకానంద్, జా.సూ.శర్మ, దా.ఉమాశర్మ, ధరణీ శర్మ, అర్.కె.శర్మ వైదిక సహకారం అందించారు.

నేత్ర శస్త్రచికిత్సలకు తరలింపు

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన కంటి వైద్య శిబిరాల్లో గుర్తించిన వారిని బుధవారం నేత్ర శస్త్రచికిత్సలకు తరలించారు. మండలంలో 15 మందిని ఎంపిక చేయగా, వారిని విజయనగరంలోని పుష్పగిరి కంటి ఆస్పత్రికి తీసుకెళ్లారు. వీరికి గురువారం శస్త్రచికిత్సలు చేస్తారని కంటి వెలుగు సెల్ అధికారి జీరు నగేష్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో కంటి వైద్య సహాయకులు శైలజ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

దొంగకు 8 నెలల జైలు శిక్ష

ప్రజాశక్తి-మక్కువ

మండలంలోని మక్కువ, మునక్కాయవలస గ్రామాల్లోని ఆలయాల్లో దొంగతనాలకు పాల్పడిన సిహెచ్ జగదీష్‌కు 8 నెలల జైలు శిక్ష, రూ.500 జరిమానా విధిస్తూ సాలూరు మెజిస్ట్రేట్ కె.రమేష్ తీర్పునిచ్చారు. ఈ మేరకు బుధవారం మక్కువ ఎస్ఐ పి.నరసింహమూర్తి వివరాలను వెల్లడించారు. 2019లో జరిగిన ఈ దొంగతనం కేసును అప్పటి ఎస్ఐ షేక్ శంకర్ నమోదు చేసి కోర్టుకు అప్పగించారు. పోలీసుల తరపున అడ్వకేట్ మాధవి ఈ కేసును వాదించినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ మేరకు బుధవారం కోర్టు తీర్పునిచ్చినట్లు తెలిపారు.

IN THE HONOURABLE COURT OF THE SENIOR CIVIL JUDGE AT VIZIANAGARAM
I.P. NO- 02/2023

Between:
Bathula Adinarayana & another
.......Petitioner

And:
Ippili Lakshmi and 5 others
......Respondents

To
Naidana Annapurna, W/o Ramana, R/o Gollaveedhi, Salur, Vizianagaram District.
... Respondent - 4

ఇందలి పిటిషనర్ శ్రీ కోర్టు వారి వద్ద తమను ఇన్‌సాల్వేన్సీగా డిక్లేర్ చేయమని కోరుతూ దాఖలు చేసిన దావాలో మీ యొక్క ఆక్షేణపలు దాఖలు చేయుటకు **తే.23-02-2024న ఉదయం 10-30 గంటల**కు మీరు దాఖలు గానీ మీ తరుపు లాయరు ద్వారా గాని దాఖలు చేయవలెను. అట్లు కానిచో ఉన్న ఆధారాలతో మీ పరోక్షంలో తీర్మాణం జేయడమగునని ఇందుములంగా తెలియజేయడమైనది.

A.P. ASWANI KUMAR, L.L.B
ADVOCATE
B4, Second Floor, Sai Vihar Apartments
Opp: Sai Baba Temple, Phase-II,
Cantonment, Vizianagaram-3 (A.P)
Ph:8247288975,9440019637 A.P.